కెటిఆర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌పై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సిఎం రేవంత్‌రెడ్డి బిల్డర్లు, వ్యాపారుల నుంచి రూ.2,500 కోట్లు వసూలు చేసి ఢిల్లీ పెద్దలకు ఇచ్చారంటూ, లోక్‌సభ ఎన్నికల తర్వాత సిఎం రేవంత్ బిజెపిలోకి వెళ్తారని ఇటీవల కెటిఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాసరావు హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కెటిఆర్ నిరాధారమైన ఆరోపణల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగి పార్టీల మధ్య విద్వేషాలు చెలరేగే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందువల్ల ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు హనుమకొండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు ఐపిసి 504, 505(2) సెక్షన్ల కింద కెటిఆర్‌పై కేసు నమోదు చేశారు.

సాహితీవేత్తలు భవిష్యత్ దర్శనం చేయాలి

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

సాహితీవేత్తలు వర్ధమాన సంఘటనలపై స్పందించడమే కాక భవిష్యత్తును దర్శనం చేసి రచనలు చేయాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మనిషిలో దైవత్వాన్ని చూడడమే తన సాహితీ ప్రక్రియల లక్షణం అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై ఆచార్య కొలకలూరి మధు జ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి-దృష్టి గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని గ్రంధాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తన సాహితీ సేద్యం, కథ వ్యాసం, నాటకం, అనువాదం కవిత్వం, నవల విమర్శ ఇలా సాగిందన్నరు. ప్రజాస్వామ్యం అనే సంపుటిలో తక్కువ శాతం ఓట్లు వచ్చిన పార్టీ అధిక శాతం ప్రజలను పాలించడంపై రాశానని తెలిపారు. గ్రంథ రచయిత మధు జ్యోతి మాట్లాడుతూ.. ఇనాక్ సాహిత్యం సమస్తం ప్రేమతత్వంతో ముడి పడి ఉంటుందనీ, వేరు వేరు సందర్భాలలో వేరు వేరుగా ఆ భావాలు వ్యక్తం అవుతాయని వివరించారు. స్త్రీ హక్కులు, స్వేచ్ఛ గురించి ఎవరూ మాట్లాడని రోజుల్లో ఇనాక్ తన సాహిత్యంలో వాటి గురించి ప్రస్తావన చేశారని గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో చక్రపాణి, గుండవరపు గీతా దేవి ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలు ఉండొద్దు

- వేసవికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించండి
- ట్యాంకర్ బుక్‌చేస్తే 12 గంటల్లో డెలివరీ
- పరీక్షల సమయం...విద్యార్థులను ఇబ్బందిపెట్టొద్దు
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- సమీక్షా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ కోతలు, తాగునీటి కొరత ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీనికోసం రెండు శాఖలు తక్షణం వేసవి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలనీ, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులే బాధ్యులని స్పష్టం చేశారు. శనివారంనాడిక్కడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యుత్, తాగునీటి శాఖలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు చేపడుతున్న కార్యాచరణలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున ఎక్కడా ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పీక్ డిమాండ్ పెరుగుతున్నా, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు ఆ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, డిస్కంల సిఎండిలను అభినందించారు. అలాగే రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో ట్యాంకర్ బుక్ చేస్తే 12 గంటల్లో డెలివరీ అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఈ మేరకు అవసరమైన వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ వరకు బోర్‌వెల్స్, బావులు వంటి స్థానిక నీటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్య ఉన్న చోట తక్షణ పరిష్కారాలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా డ్రింకింగ్ వాటర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలనీ, అవసరాన్ని బట్టి రాష్ట్ర స్థాయి నుంచి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు రాష్ట్రంలోని డిమాండ్, సప్లయ్ వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందనీ, రాష్ట్రంలో సగటున 9,712 మెగావాట్ల విద్యుత్ లోడ్ ఉంటున్నదని చెప్పారు. గడచిన రెండు వారాలుగా 14 వేల మెగావాట్ల నుంచి 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంటున్నదని వివరించారు. ఏప్రిల్ నెల రెండో వారం వరకు దాదాపు ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుందని అంచనా వేశామని అధికారులు తెలిపారు. గత ఏడాది (2023) జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా జరిగిందనీ, 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో రోజుకు సగటున 251.59 మిలియన్ యూనిట్ల సరఫరా చేశామని గణాంకాలతో వివరించారు. గత ఏడాది మార్చి 14న 297.89 మిలియన్ యూనిట్లు సరఫరా అత్యధిక రికార్డు కాగా, ఈ ఏడాది 308.54 మిలియన్ యూనిట్లతో కొత్త రికార్డు నమోదైందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ బాగా పెరిగిందనీ, మే నెలలో ఉండాల్సిన డిమాండ్ మార్చి నెలలోనే వచ్చిందని చెప్పారు. ఏదేమైనా రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు కరెంటు, తాగునీటి సమస్యలు రాకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రెండు శాఖల అధికారులను సీఎం ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

అవకాశవాదులకు బుద్ధి చెబుదాం

- పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యమకారులను గెలిపించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అవకాశవాదులకు బుద్ధి చెప్పి ఉద్యమకారులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశంలోని అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని, కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను కొల్లగొట్టి బడా కార్పొరేటు సంస్థలకు అప్పగిస్తోందన్నారు. దేశంలో ఉన్న ప్రజల ఆస్తులను, కంపెనీలను, సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలన్నా.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్నా రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే దేశాన్ని తాకట్టు పెట్టడం ఖాయమన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా ఎండి జహంగీర్ పోటీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మిగిలిన 16 స్థానాలలో ఎవరికి మద్దతు ఇవ్వాలో త్వరలో ప్రకటిస్తామన్నారు. జహంగీర్ విద్యార్థి దశ నుంచి నేటి వరకు 35 ఏళ్లుగా.. అనేక ప్రజాసంఘాలలో పని చేస్తూ ప్రజల కోసం పోరాటాలు నిర్వహించారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించి ఎర్రజెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జహంగీర్ గెలుపు కోసం సిపిఐ, ఇతర వామపక్ష పార్టీల మద్దతు కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల ఉన్నారు.

కొంపల్లిలో మలబార్ గోల్డ్ స్టోర్ పున: ప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ కొత్తగా పునరుద్ధరించిన తమ కొంపల్లి షోరూమ్‌ను తెరిచింది. శనివారం దీనిని ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. సుచిత్ర సర్కిల్ వద్ద ఉన్న ఈ స్టోర్‌ను అత్యంత ఆధునికంగా, అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు ఆ సంస్థ పేర్కొంది. సరసమైన ధరలతో, సహేతుకమైన తరుగు ఛార్జీలతో ఆభరణాలు అందిస్తోన్నట్లు తెలిపింది. బంగారం, వజ్రాలు, ప్లాటినం, విలువైన రత్నాలు, వెండి, ప్లాటినంతో రూపొందించబడిన వివాహాభరణాలు, సంప్రదాయ ఆభరణాలు, రోజువారీ ధరించే ఆభరణాలతోపాటు మరెన్నో అసమానమైన ఆభరణాలను వి ని యో గ దా రు లు ఎంచుకోవడానికి వీలుందని పేర్కొంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ చెరుకుపల్లి తార చంద్రరెడ్డి, మలబార్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న నాగరాజు

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"గత ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం వహించినట్టుగానే ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తాం.. వెంటనే డైట్ బిల్లులు విడుదల చేయాలి.. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా 25వ మహాసభ శనివారం శంషాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు నడుస్తున్నా ఇప్పటివరకు పెండింగ్ ఉపకార వేతనాలు, హాస్టల్ బిల్లులు చెల్లించలేదన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు డైట్ బిల్లులు ఇవ్వక సంక్షేమ వసతి గృహాల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఎప్‌సెట్, నీట్ కోచింగ్ ఇవ్వాలని, ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు మెడిసిన్, బిడిఎస్, అగ్రికల్చర్, బిఎస్‌సి వంటి కోర్సులకు ఉచిత కోచింగ్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్, జిల్లా అధ్యక్షులు కెవై ప్రణయ్, ఉపాధ్యక్షులు మస్కు చరణ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- సిఎం రేవంత్‌కు టిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, కార్యదర్శులు ఎస్కే సలీమ, బి. జగదీశ్వర్, ఈ చంద్రశేఖర్ తదితరులు సిఎంను కలిశారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిఎంకు అందజేశారు. జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో పనిచేసేలా కొత్త హెల్త్ కార్డుల విధానం తీసుకురావాలని, అక్రిడిటేషన్ కార్డులను చూపిస్తే సచివాలయంలోకి అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ మీడియా అకాడమీలో అన్ని పత్రికల సంపాదకులను నియమించాలనీ,

రోడ్డుపై బైటాయించిన రైతులు

పంటలు ఎండిపోతున్నాయ్.. నీళ్లివ్వండి..

- రోడ్డుపై బైఠాయించిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంట పొలాలు ఎండిపోతున్నాయి.. నీళ్లిచ్చి ఆదుకోండి.. అంటూ రైతులు రొడ్డెక్కారు. శనివారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని దుంపేట ఎస్సారెస్పీ వరద కెనాల్‌పై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. చేతికొచ్చే దశలో పంట ఎండిపోతుందని, ఎస్సారెస్పీ వరద కెనాల్‌లో నీటిని విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మొన్న విడుదల చేస్తున్నామని చెప్పి నీళ్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నీళ్లు ఇవ్వకపోతే పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు.

బెర్లిన్ స్టార్టప్‌ల బృందానికి జిఎన్ఐటిఎస్ అతిథ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్

అతిథ్యంలో పాల్గొన్న బెర్లిన్ దేశస్తులు

బెర్లిన్ స్టార్టప్ ప్రతినిధుల బృందానికి జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిఎన్ఐటిఎస్)లో అతిథ్యం ఏర్పాటు చేశారు. ఎక్స్‌పాన్షన్ ల్యాబ్, బీటాహౌస్, ఆసియా బెర్లిన్‌లో కొంత భాగం నిధులు సమకూర్చిన బెర్లిన్ స్టార్టప్ డెలిగేషన్‌ను ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా 10 మంది బృందానికి జిఎన్ఐటిఎస్ క్యాంపస్‌లో ప్రయివేటు డిన్నర్ ఏర్పాటు చేశారు. ఇండో-జర్మన్ సహకారంలో భాగంగా జర్మనీలో ఉన్న స్టార్టప్‌లకు ఆసియా మార్కెట్ గేట్‌వేని సులభతరం చేయడం ఈ ప్రతినిధి బృందం యొక్క ఉద్దేశమని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి లెంక, జిఎన్ఐటిఎస్ వైస్ చైర్మన్ శ్రీ విద్యారెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు డ్రోగోడ్రోన్స్ మద్దతు

హైదరాబాద్ : డ్రోన్ టెక్నాలజీ సంస్థ డ్రోగో డ్రోన్స్ గ్రామీణ మహిళల సాధికారత కోసం డ్రోన్లను అందించినట్లు తెలిపింది. 10 వేర్వేరు ప్రదేశాల నుండి ఏకకాలంలో 1,000 డ్రోన్‌లను ప్రధాని మోడీ పంపిణీ చేశారని తెలిపింది. గ్రామీణ మహిళలకు నైపుణ్యం కలిగిన డ్రోన్ పైలట్లు కావడానికి అవసరమైన నైపుణ్యాలు, సాధనాలను అందించడం ద్వారా వారిని ఉద్ధరించడమే లక్ష్యంగా పెట్టుకున్నా మని డ్రోగో డ్రోన్స్ సిఇఒ యశ్వంత్ బొంతు తెలిపారు. నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా అధునాతన డ్రోన్లను అందించడం ద్వారా కంపెనీ తన నిబద్ధతను ప్రదర్శించిందని పేర్కొన్నారు. వ్యవసాయ సరఫరా ప్రక్రియలో మహిళలను డ్రోన్ పైలట్‌లుగా చేర్చడం ద్వారా, ఈ పథకం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొంది స్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశం కోసం..
బిజెపిని ఓడించాల్సిందే

- రాష్ట్రంలో పంటలెండుతున్నా.. పరిశీలించని మంత్రులు
- లౌకిక విలువలను కాపాడేది వామపక్షాలే
- కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం
- వామపక్షాల రాష్ట్ర సదస్సులో కూనంనేని, ఎస్ వీరయ్య, పి రంగారావు, ఎస్ వెంకటేశ్వరరావు, మధు

సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ప్రమాదమేర్పడింది. పదేళ్ల మోడీ పాలనలో నియంతృత్వం రాజ్యమేలుతున్నది. అప్రకటిత చీకటి పాలన సాగుతున్నది. ప్రజలకు సవచేస్తానని అధికారంలోకొచ్చిన మోడీ సర్కార్.. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నది. వారి సంపదను రెట్టింపు చేసేందుకకావాల్సిన విధానాలను రూపొందించింది. ఇదేంటని అడిగిన వారిపై ఉక్కుపాదాన్ని మోపుతున్నది. సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ పేరుతో మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యానికి పాల్పడింది. కోట్లాది మంది ప్రజలు ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, అవిద్యతో బాధపడుతుంటే..మోడీ ఫిడేలు వాయించుకుంటూ ఖరీదైన సూటూ, బూటుతో ఫొటోలకు పోజులిస్తే..ప్రజా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయ'ని పలువురు వామపక్ష నేతలు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 11 వామపక్షాల ఆధ్వర్యంలో 'కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదం' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు అధ్యక్షత వహించగా శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్‌డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎ మధు, ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యుసిఐ నాయకులు జానీపాష, ఆర్ఎస్‌పి కార్యదర్శి జానకిరాములు, సిపిఐ (ఎంఎల్) కార్యదర్శి ప్రసాదన్న, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి ఎం రమేష్‌రాజా పాల్గొని ప్రసంగించారు.

ఏప్రిల్ ఒకటి నుంచి 15 వరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద చర్యలను ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, సదస్సులు, ప్రచార క్యాంపియన్ నిర్వహించాలని సదస్సు తీర్మానించింది.

సిపిఎం నేత వీరయ్య మాట్లాడుతూ.. పదేండ్ల మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. వారి అసంతృప్తిని మళ్లించేందుకు వైషమ్యాలు సృష్టించటం, కాదంటే..నిరంకుశత్వాన్ని ప్రదర్శించడం చేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థలు మోడీ జేబు సంస్థలుగా మారి, ప్రతిపక్ష పార్టీలను వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో మెజారిటీ హిందువుల ఓట్లను పొందేందుకు వీలుగా మత వైషమ్యాలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని బిజెపి ప్రభుత్వం, అంబానీ, అదాని లాంటి బడా కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచి పెడుతోందని మండిపడ్డారు. దేశంలో 100 కోట్ల మంది పౌష్టికాహారం లేక ఇబ్బందులు పడుతున్నారని అంతర్జాతీయ నివేదికలు చెబుతుంటే..లేదు..లేదు 81కోట్ల మందే పౌష్టికాహార లేమితో బాధపడుతున్నారని మోడీ ప్రభుత్వం చెప్పిందంటే ఇంత కంటే సిగ్గుమాలిన వ్యవహారం ఇంకోకటి ఉంటుందా? అని ప్రశ్నించారు. వీరంతా తీవ్ర అనారోగ్యాలతో ఆస్పత్రుల పాలవుతుంటే..భారత్ వెలిగిపోతున్నదని ప్రచారం చేసుకోవటమేంటని ప్రశ్నించారు. శ్రమకు తగిన ఫలితం లేక కోట్లాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతుంటే..మోడీ కనీస వేతనాలు ప్రకటించిన తీరు అత్యంత ధారుణంగా ఉందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు కనీస కూలీలేదు, రైతుల ఆందోళనను పట్టించుకునే దిక్కు లేదు, మరి ఎవరి కోసం ఈ దేశాన్ని ఏలుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి, తిరిగి ఎన్నికల్లో గెలవాలని బిజెపి తాపత్రయ పడుతున్నదని చెప్పారు. దేశంలో అదానికి మించిన దేశభక్తుడు లేడని ఆర్ఎస్ఎస్ చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. దేశంలో తామేం చేసినా చెల్లుబాటు అవుతుందని బరితెగించి వ్యవహరిస్తున్నారని చెప్పారు. మోడీ ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలపై వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర వాదులు పోరాడాల్సిన అవశ్యకత పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతుంటే వాటిని పరిశీలించి, రైతులకు భరోసా కల్పించాల్సిన మంత్రులు మిన్నకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఆయారాం, గాయారాంల తీరును తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. రాజ్యాంగం ఆధారంగా ఎన్నికైన మోడీ ఆ విలువలనే తుంగలో తొక్కుతున్నారనీ, నిరంకుశ పద్ధతుల్లో పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. మోడీనీ, బిజెపిని ప్రశ్నించే వారిని, విమర్శించే వారిని సహించడం లేదన్నారు. మాస్‌లైన్ కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ మతరాజ్య స్థాపన, కార్పొరేట్ల సంపద పెంపే లక్ష్యంగా బిజెపి విధానాలను రూపొందించిందని చెప్పారు.

ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ హయాంలో దేశంలో మతోన్మాదం వికటాట్టహాసం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.రవి, జానీపాష జానికి రాములు, ప్రసాదన్న, రమేష్‌రాజా,ఆర్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి ప్రజలు సంఘటితంగా పోరాడాలని కోరారు. కేంద్రం తీరు మారకుంటే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు బాలమల్లేశ్ పాల్గొన్నారు.

స్మార్ట్ టివిల ధరలు పెరగొచ్చు

న్యూఢిల్లీ : దేశంలో స్మార్ట్ టివిల ధరలు పెరగొచ్చని కౌంటర్ పాయింట్స్ ఐఒటి సర్వీస్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ప్యానెల్ ధరలు పెరగడమే ఇందుకు కారణమని తెలిపింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో టివిల ధరలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషించింది. దేశీయంగా ప్రీమియం మాడళ్లకు డిమాండ్ అధికంగా ఉంది. ధరలు పెరిగినప్పటికీ స్మార్ట్ టివి దిగుమతులు 9 శాతం పెరగొచ్చని అంచనా వేసింది. వినియోగదారుల అభిరుచులు మారుతున్నాయని తెలిపింది. దేశ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో గతేడాది టివిల దిగుమతుల్లో 16 శాతం పతనం కనబడింది.

2047 నాటికి 2 లక్షల కంపెనీ సెక్రటరీలు అవసరం

- ఈ ఏడాది 25వేల విద్యార్థులకు శిక్షణ
- ఏప్రిల్‌లో సింగపూర్‌లో అంతర్జాతీయ సదస్సు
- ఐసిఎస్ఐ ప్రెసిడెంట్ నరసింహన్ వెల్లడి

హైదరాబాద్ : ప్రస్తుత ఏడాదిలో వివిధ కోర్సుల్లో రెట్టింపు విద్యార్థులను నమోదు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ది ఇన్‌స్ట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) వెల్లడించింది. శనివారం హైదరాబాద్‌లో 'డెమిస్టిఫైయింగ్ ఎన్‌సిఎల్‌టి ప్రాక్టిసెస్'పై సెమినార్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఐసిఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ బి నరసింహన్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఆర్ వెంకట రమణ మీడియాతో మాట్లాడారు. ప్రతీ ఏడాది వివిధ ప్రోగ్రామ్స్‌ల్లో 14,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది దీన్ని 25వేల వరకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం దేశంలో 72వేల మంది కంపెనీ సెక్రటరీలు ఉన్నారని నరసింహన్ తెలిపారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్లకు ఆర్థిక వ్యవస్థ చేరితే.. 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీల అవసరం ఉంటుందన్నారు. ఐసిఎస్ఐలో 72వేల పైగా సభ్యులు, 2 లక్షల మేర విద్యార్థులు నమోదై ఉన్నారని వెల్లడించారు. దేశంలోని 141 యూనివర్శిటీలతో ఒప్పందం కలిగి ఉన్నామన్నారు. తాజాగా ఉస్మానియా యూనివర్శిటీతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామన్నారు. సెక్యూరిటీస్ మార్కెట్స్‌పై ప్రోగ్రామ్‌ను చేపట్టడానికి సెబీతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఏప్రిల్ 5-6 తేదిల్లో సింగపూర్‌లో ఐసిఎస్ఐ మూడో అంతర్జాతీయ సదస్సును నిర్వహించ నున్నామన్నారు. దీనికి భారత్ నుంచి 100 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు.

IN THE COURT OF THE XIV ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT AT :: HYDERABAD.
I.A. NO. 1244 OF 2023
IN
ARB.O.P. NO. 1315 OF 2003

Between:
Union of India & others ...Petitioners
AND
M/s Phoenix Telecommunications Ltd., & another ...Respondents

To,
M/s Phoenix Telecommunications Ltd., Since amalgamated with M/s MIC Electronics Ltd., As per the order Hon'ble High Court of A.P., Hyderabad with its Registered Office at A-4, Electronics Complex, Kushaiguda, ECIL Post, Hyderabad-500 062, Rep. by its M.D.

Kindly take notice that the Petitioners filed above I.A. No. 1244 of 2023 in Arb. O.P. No. 1315 of 2003 U/O 9 Rule 9 of CPC to set aside the dismissal order dated 13.10.2017 and the same is posted to 15.03.2024 for your appearance.

Therefore, you are hereby directed to appear before the above court at **10.30** A.M on **15.04.2024** in person or through Advocate, failing which the proceedings will be conducted in your absence.

Place: Hyderabad
Date : 26-03-2024

//BY ORDER OF THE COURT//
S. PRABHAKAR REDDY,
Advocate
H.No. 1-8-732/9,1st Floor, Above Moon Café, Vegetable Market Road, Nallakunta, Hyd.

సుజనా పరిశ్రమ యూనిట్-4 సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామికవాడలోని సుజనా స్టీల్ యూనిట్-4 ఆస్తి పన్ను చెల్లించడంలో విఫలం కావడంతో.. ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్ డ్రైవ్‌లో భాగంగా పరిశ్రమను శనివారం సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్ భాష గురించి మాట్లాడండి..

- అవసరమైతే ఆయనకు శిక్షణనిప్పించండి...
- డిప్యూటీ సిఎంకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భాష గురించి మాట్లాడేముందు సిఎం రేవంత్‌రెడ్డి వాడే భాష గురించి చర్చిస్తే బావుంటుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద... డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు సూచించారు. అవసరమైతే రేవంత్‌కు... ఎఐసిసి పెద్దలతో భాషపై శిక్షణ ఇప్పించాలని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సిఎం కూడా ఆయనకు ట్రైనింగ్ ఇవ్వొచ్చని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివేకానంద మాట్లాడుతూ... సిఎం, మంత్రులు సత్యదూరమైన మాటలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. రేవంత్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా వ్యక్తిగత దూషణ భాషణలకు దిగుతున్నారని గుర్తు చేశారు. మాజీ సిఎం కెసిఆర్ వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా రేవంత్ నీచంగా, ఘోరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. అందువల్ల ముందుగా ఆయన తన భాషను మార్చుకుంటే అందరూ స్వాగతిస్తారని అన్నారు. అలాంటి మంచి సంప్రదాయాన్ని నెలకొల్పాలంటూ సిఎంకు సూచించారు. ఆరు గ్యారెంటీలను పక్కనబెట్టిన కాంగ్రెస్ నేతలు, మంత్రులు... ఫోన్ ట్యాపింగ్ విషయాలను ముందుకు తెస్తున్నారని విమర్శించారు. సాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే, వారికి ధైర్యం చెప్పలేక సిఎం, మంత్రులు తప్పించుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఏప్రిల్ కూడా రాకముందే హైదరాబాద్‌లో నీటి ఎద్దడి ప్రారంభమైందని వివేకానంద ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఖాతాలో జిహెచ్ఎంసి..?

- ఇప్పటికే డిప్యూటీ మేయర్, పలువురు కాంగ్రెస్‌లో చేరిక
- తాజాగా మేయర్, మరికొంత మంది కార్పొరేటర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాజకీయాల్లో జోరుగా మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రధాన రాజకీయ పార్టీలు తమ తమ వ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ నియోజకవర్గాలతోపాటు హైదరాబాద్ బల్దియాపై దృష్టి సారించింది. రాష్ట్రానికి గుండెకాయ లాంటి బల్దియాపై కాంగ్రెస్ జెండా ఉండాలని ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం ఓటర్లు బిఆర్ఎస్‌కే పట్టం కట్టిన విషయం తెలిసిందే. గ్రేటర్‌లో 29 అసెంబ్లీ సీట్లకు గాను మూడింటిలోనే కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో బల్దియాపై పూర్తి స్థాయిలో పట్టు కోసం కాంగ్రెస్ అధిష్టానం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలంటే మరింత బలం అవసరమని భావించిన కాంగ్రెస్ పెద్దలు బల్దియాలో పార్టీ మరింత బలోపేతం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎక్కువ మంది కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలే కాకుండా క్షేత్రస్థాయిలో నాయకులను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

బల్దియాలో మార్పు...

గతంలో బిఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో చాలా మంది నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు పాలకవర్గాలు కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చాయి. ఈ క్రమంలో బల్దియా పరిధిలో సైతం మార్పు వచ్చింది. ఇప్పటికే బల్దియా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవీ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పెద్దలతో మరికొంత మంది కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్‌లో చేరేందుకు వారు సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం.

హస్తం గూటికి మరికొంత మంది..

గ్రేటర్ హైదరాబాద్‌లో 150 కార్పొరేట్ల సీట్లకు గాను గత ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఈ క్రమంలో ఇటీవల కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం మరింత పెరిగింది. ముఖ్యంగా ఎంపి ఎన్నికల్లోపు బిఆర్ఎస్, బిజెపి నుంచి దాదాపు 30 నుంచి 40 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని తెలిసింది. ఇప్పటికే కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు చేసుకుని, అంతర్గత ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం. మరో రెండుమూడు వారాల్లో పలువురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరనున్నారని తెలుస్తోంది. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి వ్యూహ రచనచేస్తున్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరేందుకు అధికసంఖ్యలో సుముఖత చూపిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం బరిలో నిలిచారు. వికారాబాద్ జెడ్‌పి చైర్మన్ సునీతా మహేందర్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరి మల్కాజ్‌గిరి నుంచి పోటీలో నిలిచారు. ఈ రెండు స్థానాల పరిధిలో 14 శాసనసభా నియోజకవర్గాలుండగా ఒక్కచోటా కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యే లేరు. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని చాలా నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్ కోసం కాంగ్రెస్ పెద్దలు కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే మరికొద్ది రోజుల్లోనే ఐదారుగురు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని సమాచారం.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

వంద రోజుల హామీలు నీటి బుడగలు

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వంద రోజుల హామీలు అన్నీ నీటి బుడగలేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఓ అతిథి గృహంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఆర్‌టిసి, సివిల్ సప్లై దివాలా తీస్తున్నాయన్నారు. పెన్షన్ రూ.నాలుగు వేలు, రైతుబంధు రూ.15000, కూలీలకు రూ.12000 ఇప్పటివరకు ప్రభుత్వం వేయలేదన్నారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. ఆరు నెలలు ఓపిక పట్టండి.. భవిష్యత్ కెసిఆర్ నాయకత్వంలో ఉంటుందని చెప్పారు. కష్ట కాలంలో పార్టీని వదిలి వెళ్లిపోతున్న వారిని తిరిగి తీసుకోబోమని, పార్టీకి నష్టం చేసిన వాళ్ల లెక్కలు తీస్తున్నామని, వడ్డీతో తీసుకుంటామని అన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావుపై గ్రామాల్లో చర్చ పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మెదక్ జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరించిన రజాకార్ సినిమా

- యువకుల మెదళ్లను విషపూరితం చేస్తున్నారు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమరవీరుల పోరుగాథను వక్రీకరించి యువకుల మెదళ్లను విషపూరితం చేస్తున్నారని.. రజాకార్ సినిమాలో తెలంగాణ సాయుధ రైతాంగ చరిత్రను వక్రీకరించారని వక్తలు అన్నారు. 'రజాకార్ సినిమా చరిత్ర వక్రీకరణ-వాస్తవాలు' అనే అంశంపై హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కోట రమేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని తెలిపారు. నాలుగు వేల మంది అమరవీరుల పోరుగాథను ప్రస్తుతం రజాకార్ సినిమాలో వక్రీకరించి యువకుల మెదళ్లను విషపూరితం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలో పచ్చి అబద్ధాలు చెప్పడంతో ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. అందువల్లే సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని చెప్పారు. మూలాల్ని విస్మరిస్తే.. మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నిజమైన చరిత్రను వక్రీకరించి సినిమా తీసిన దర్శక, నిర్మాతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సినిమాలో కుండెడు అబద్ధాల విషం పోసి, చిటికెడు నిజం కలిపారని వ్యాఖ్యానించారు. అతి త్వరలో నిజమైన చరిత్రను డాక్యుమెంటరీ చిత్రాల ద్వారా గ్రామగ్రామాన ప్రచారం చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయకుమార్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం గౌరవాధ్యక్షులు జి.రాములు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఎస్.నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జావేద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మమత, ఏఐఎస్డీవై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్, సిఐటియు రాష్ట్ర నాయకులు వంగూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి పరిపాలనపై సోయి లేదు

- రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండాయి
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సిఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనపై సోయి లేదు.. ఇప్పటివరకు వ్యవసాయంపై ఒక్క మంత్రి కూడా సమీక్ష చేయలేదు.. రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి.." అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కెసిఆర్ ఉంటే.. భూమి ఆకాశాన్ని ఒక్కటి చేసైనా సరే అన్నదాతలకు నీళ్లు అందించే వారిని చెప్పుకొచ్చారు. పంట పొలాల పరిశీలనకు ఆదివారం ఉదయం 9 గంటలకు కెసిఆర్ బయలుదేరి భువనగిరి మీదుగా జనగామ వెళ్తారని చెప్పారు. మొదట దేవరుప్పులలో ఎండిన పంటలను పరిశీలిస్తారని, ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో పంట పొలాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని జనగామ రోడ్‌లో పంటలను పరిశీలన తర్వాత సూర్యాపేటలో ప్రెస్‌మీట్‌లో మాజీ సీఎం కెసిఆర్ మాట్లాడతారని చెప్పారు. అక్కడి నుంచి హాలియా, మిర్యాలగూడ రోడ్ పక్కన ఉన్న సాగర్ ఆయకట్టులో ఎండిన పొలాలను పరిశీలించి హైదరాబాద్ వెళ్తారని తెలిపారు. తన ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కష్టాలు చూడలేక వారిని ఓదార్చేందుకు కెసిఆర్ వస్తున్నారన్నారు. రాష్ట్రంలో సాగు నీళ్ల అందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయని రైతులు మొరపెట్టుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో సాగర్‌లో డెడ్ స్టోరేజ్‌లో నీళ్లు వున్నా పంటలకు నీరందించి అన్నదాతలను ఆదుకున్నామని చెప్పారు. జిల్లా మంత్రులు అక్రమ వసూళ్లు, దందాలు మొదలుపెట్టారని ఆరోపించారు. కోమటిరెడ్డి ఓ జోకర్.. ఆయన మాటలకు ఎక్కడా విలువ లేదని విమర్శించారు. రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సిఎంగా ఉండటం మన దౌర్భాగ్యం అన్నారు. పరిపాలన చేతకాక అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు కాంగ్రెస్ నయవంచనను అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కోటిరెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

అవిశ్వాసాలు నెగ్గాయి

- కామారెడ్డి మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్‌గా గడ్డం ఇందుప్రియ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై, కరీంనగర్ జిల్లా రామడుగు మండల ఎంపిపిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. శనివారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, మున్సిపల్ కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించారు. 49 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యులు అవసరం ఉండగా.. 37 మంది సభ్యులు హాజరై తమ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బిఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మద్దతు తెలిపారు. 37 మంది సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవికి వ్యతిరేకంగా చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో అధికారులు అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న గడ్డం ఇందుప్రియ బాధ్యతలు స్వీకరించారు.

కరీంనగర్ జిల్లా రామడుగు మండల ఎంపిపిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మండల పరిషత్‌లో 14మంది సభ్యులు ఉన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీ ఎంపటిసిలు 12మంది.. ఈ యేడాది జనవరి నెలలో టిఆర్ఎస్‌కు చెందిన ఎంపిపి కలిగేటి కవితాలక్ష్మణ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్‌డిఒకు తీర్మాన పత్రం అందజేశారు. ఈ క్రమంలో అవిశ్వాసంపై ఎంపిపి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. స్టే కాలం ముగియడంతో మండల కేంద్రంలో ఆర్‌డిఒ మహేశ్వర్ శనివారం ఎంపిడిఒ రాజేశ్వరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి 12 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు పలికారు. దీంతో ఎంపిపి సభ్యులు కలిగేటి కవితపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు ఇన్‌చార్జి ఎంపిపిగా వైస్ ఎంపిపి సభ్యులు పూరెల్ల గోపాల్‌గౌడ్ కొనసాగుతారని ఆర్‌డిఒ తెలిపారు.

పట్టణ ప్రజల సమస్యలను మేనిఫెస్టోల్లో పెట్టాలి

- జాతీయ పట్టణ పోరాటాల వేదిక డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయపార్టీలన్నీ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారాలను తమ మేనిఫెస్టోల్లో చేర్చాలని జాతీయ పట్టణ పోరాటాల వేదిక విజ్ఞప్తి చేసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో పలు సంఘాల నేతలు మాట్లాడారు. జాతీయ ప్రజా ఉద్యమాల వేదిక (ఎన్‌ఎపిఎమ్) జాతీయ నాయకులు మీరా సంఘమిత్ర, యువజన విభాగం నాయకులు జాన్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, నిరాశ్రయ శ్రామిక సంఘం నాయకులు ఫిరోజ్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజల సమస్యలతోకూడిన మేనిఫెస్టోను వారు విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో ప్రతులను అన్ని రాజకీయపార్టీలకు అందజేసి, తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని కోరతామని చెప్పారు. సమ్మిళిత నగరాలు, గృహ నిర్మాణం, జీవనోపాధి, కార్మికహక్కుల పరిరక్షణను అన్ని పార్టీలు విధిగా ప్రకటించాలని కోరారు. పట్టణాల్లో పని చేస్తున్న వివిధ శ్రామిక వర్గాల జనాభా 70 శాతానికి పైగా ఉందనీ, నగరాల్లో వారికి న్యాయమైన వాటాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరాభివృద్ధి పేరుతో వారి ప్రాథమిక అవసరాలు, హక్కులకు ఎప్పుడూ భంగం కలుగుతూనే ఉందని వివరించారు. ఈ సందర్భంగా పది అంశాలతో కూడిన పట్టణ మేనిఫెస్టో అమలును తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

కార్యకర్తల కష్టంతోనే అధికారం

- పేదల కోసం రాహుల్‌గాంధీ పాదయాత్ర
- ఎఐసిసి ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి

అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ కార్యకర్తల కష్టం ఫలితమే తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎఐసిసి ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి అన్నారు. సూర్యాపేట జిల్లా మట్టపల్లి వద్ద నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఆమె మాట్లాడుతూ.. దేశంలో పదేండ్ల బిజెపి పాలనలో ప్రజలు అన్ని విధాలా మోసపోయారన్నారు. రాహుల్‌గాంధీ పేదలకు అండగా ఉండేందుకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు యాత్రలు చేశారని చెప్పారు. దేశ ప్రజలు చేతితో చేయి కలిపి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతం సిమెంట్ పరిశ్రమలకు నిలయమని మంత్రి ఉత్తమ్ చెప్పారని, ఇండ్లు కట్టేందుకు సిమెంట్ ఎంత అవసరమో.. పార్టీ పటిష్టంగా ఉండేందుకు కార్యకర్తలు అంత అవసరమని చెప్పారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సభలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఉత్తమ్ పద్మావతి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం ఇంటి వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశారు. సిఎం తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. భూపాలపల్లి జిల్లాకు చెందిన కృష్ణసాగర్ శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసం వద్ద పెట్రోల్ పోసుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతన్ని పట్టుకొని ఒంటిపై నీళ్లు పోసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న తమకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం, అందుకే ఆత్మహత్యాయత్నం చేశానని పోలీసుల విచారణలో కృష్ణాసాగర్ తెలిపారు. సిఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఈ ఘటనకు పాల్పడినట్టు అతను చెప్పినట్టు తెలిసింది.

మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్
- నకిరేకల్‌లో మహిళా రైతుల రాష్ట్ర సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పురుష రైతుల మాదిరిగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను మహిళా రైతులకు వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని కెఆర్ ఆడిటోరియంలో శనివారం మహిళా రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో మహిళలు రోజుకు 12 నుంచి 15 గంటలు పని చేస్తున్నారని వివరించారు. వారు చేసే పనుల్లో ఎక్కువ భాగం లెక్కకు రావడం లేదన్నారు. పురుషులతో పోల్చినప్పుడు మహిళలు తెచ్చే ఆదాయం తక్కువగానే కనిపిస్తున్నా.. పని మాత్రం అధికంగా ఉంటుందని చెప్పారు. మహిళలు పురుషులతో సమానంగా పని చేస్తున్నా వేతనం, కూలి తక్కువగా అందుతోందని వివిధ అధ్యయనాలు పేర్కొంటున్నాయని తెలిపారు. సాగుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలు పురుషులతో సమానంగా మహిళా రైతులకు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం రెవెన్యూ రికార్డులలో మహిళా రైతుల పేరు నమోదు కాకపోవడమేనని చెప్పారు. ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా అన్ని రెవెన్యూ రికార్డుల్లో మహిళల పేర్లు నమోదయ్యేలా చట్టాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల మాట్లాడుతూ.. వ్యవసాయంలో మహిళల సామర్థ్యం పెరగనిదే వ్యవసాయ ఉత్పాదకత పెరగదన్నారు. మహిళల్లో సాంకేతిక సామర్థ్యాన్ని పెంచడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ మహిళల సమస్యలను గుర్తించటానికి నిపుణుల బృందంతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి తక్షణ సమస్యలను గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేక పనిముట్లు, యంత్రాలను రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రత్యేక పథకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆఫీస్ బేరర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొప్పుల రజిత, కంచర్ల ఊర్మిళ, మండల కార్యదర్శి మర్రి వెంకటయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాచకొండ వెంకట్, సీఐటీయూ నాయకులు ఒంటెపాక వెంకటేశ్వర్లు, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, జిట్టా సరోజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి హైదరాబాద్ మేయర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆమెను ఆహ్వానించారు. విజయ లక్ష్మితోపాటు ఆమె సోదరుడు వెంకట్ కూడా పార్టీలో చేరారు. ఇటీవల తాము బిఆర్ఎస్ పార్టీని వీడామని వెంకట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే సోదరితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కెకె నివాసానికి సిఎం రేవంత్‌రెడ్డి

బిఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, సీనియర్ నేత కె.కేశవరావు నివాసానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కెకె నివాసానికి సిఎంతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపిలు రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, సీనియర్ నేత కె జానారెడ్డి, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ తదితరులు వెళ్లారు. పార్టీలో చేరే విషయంపై ఆయనతో చర్చించారు.

బలహీనవర్గాలకు బిఆర్ఎస్ ఏం చేసిందో చెప్పగలరా?

- కెటిఆర్‌కు పొన్నం ప్రభాకర్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బలహీనవర్గాలకు బిఆర్ఎస్ సర్కారు ఏం చేసిందో చెప్పాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్‌ను డిమాండ్ చేశారు. దానిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. అధికారంలో ఉండగా మీరే అన్ని ముఖ్యమైన పదవులు చేపట్టి, ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. త్వరలోనే కులగణన చేపట్టబోతున్నామని చెప్పారు. 16 కులాలకు కార్పొరేషన్లు కేటాయించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే అడిగే స్వేచ్ఛ తమకుందని చెప్పారు. బిఆర్ఎస్‌లో బలహీన వర్గాలకు న్యాయం దక్కలేదన్నారు. బిజెపి బలహీన వర్గాల వ్యక్తిని అధ్యక్ష పదవి నుంచి తొలగించి జి.కిషన్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించిందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేసే ముందు కెటిఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని పొన్నం హెచ్చరించారు.